క్లుప్తంగా

అంకితభావంతో పనిచేయాలి



నియామక పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు

కవిటి: అంగన్‌వాడీల్లో నూతనంగా నియామకమైన ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ సూచించారు. మండలంలో బల్లిపుట్టుగలోని తమ స్వగృహంలో ఇటీవల అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్‌గా ఉద్యోగాలు పొందిన ముగ్గురు అభ్యర్థులకు నియామక పత్రాలను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇచ్ఛాపురం రూరల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పురాణం నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత క్రాంతి యువసేన



ట్రోఫీతో క్రాంతి యువసేన జట్టు

మందస: మండలంలోని ఉద్దాన ప్రాంతమైన రాంపురంలో గత వారం రోజులుగా జరుగుతున్న మండల స్థాయి క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఫైనల్స్‌లో ఉదయ్ 11 కింగ్స్, క్రాంతి యువసేన జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఉదయ్ 11 కింగ్స్ జట్టు నిర్ణీత 10 ఓవర్లకు ఏడు వికెట్లు కోల్పోయి 91 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన క్రాంతి యువసేన జట్టు నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ఉదయ్ ఎంపికయ్యాడు. విజేతలకు సర్పంచ్ పొట్టి ధర్మారావు చేతుల మీదుగా ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో మర్ల సంతోష్, హేమరాజు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి పనులు మంజూరు చేయండి'



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ లోకనాథం

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు పంచాయతీకి అభివృద్ధి పనులు మంజూరు చేయాలని ఎంపీటీసీ చుక్క లోకనాథం కోరారు. ఈ మేరకు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.రాజేశ్వరమ్మకు వినతిపత్రం బుధవారం అందజేశారు. ఎస్సీ కాలనీలో కొత్తగా శ్మశానవాటికకు సీసీ రోడ్డు, గ్రామంలో కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.


టీటీడీ ఆధ్వర్యంలో దేవాలయాల నిర్మాణాలు



ఈదుపురంలో గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న టీటీడీ సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం, బొడ్డబడ గ్రామాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో రెండు ఆలయాల నిర్మాణాలు చేపట్టనున్నట్లు టీటీడీ ఈఈ సీహెచ్ రమణ తెలిపారు. విశాఖపట్నంకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు సీహెచ్ సురేష్, వీజీటీ మూర్తిలతో కలిసి రెండు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. చెరో రూ.10 లక్షలతో ఈదుపురంలో రామాలయం, బొడ్డబడలో గ్రామ దేవత ఆలయాల నిర్మాణ పనులు రెండు రోజుల్లో ప్రారంభిస్తున్నామన్నారు. పల్లెల్లో హిందూ ధార్మికత్వాన్ని పెంపొందిస్తూ, ప్రజల్లోకి ఆధ్యాత్మికత్వాన్ని తీసుకెళ్లడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, ఇచ్ఛాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్, సర్పంచ్ నర్తు వరప్రసాద్, వీఆర్వో ఉప్పాడ రాజారెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రతిష్ట



పూర్ణాహుతి సమర్పిస్తున్న ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి దంపతులు

నందిగాం: స్థానిక గణేష్ కాలనీలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి దంపతులు, గణేష్ కాలనీ ప్రజల సహకారంతో నిర్మించిన సిద్ధి వినాయక ఆలయాన్ని భక్తిశ్రద్ధలతో బుధవారం ప్రతిష్ఠించారు. గ్రామ పురోహితులు రేజేటి బోసుబాబు, మేడేపల్లి రమేష్‌బాబుల ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షాధారణ, మండపావాహన, అగ్నిప్రతిష్ఠ, విగ్రహ ఊరేగింపు, ధాన్యాధివాసం, జలాధివాసం, క్షీరాధివాసం, హవనం, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, దర్పణ దర్శనం తదితర విశేష పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ గావించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- కంచిలిలో గడప గడపకూ మన ప్రభుత్వం

కంచిలి: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండల కేంద్రం కంచిలి–1, 2 సచివాలయాల పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలను తెలుసుకొని, పరిష్కానికి చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో పేద కుటుంబాలకు మేలు జరగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, వైస్ ఎంపీపీ పాలిన కామాక్షి, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు జోగేశ్వర చౌదరి, సీహెచ్ రాజు, డొక్కరి కొగయ్య తదితరులు పాల్గొన్నారు.



సోంపేట: లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు

పేదల పక్షపాత ప్రభుత్వమిది

సోంపేట: వైఎస్సార్‌సీపీది పేదల పక్షపాత ప్రభుత్వమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని తాళభద్ర సచివాలయం పరిధి రాణిగాం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని తెలియజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన దాదాపు హామీలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్ రెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పార్టీ నాయకులు ఉగ్రపల్లి తిరుపతిరావు, ఉగ్రపల్లి కృష్ణారావు, ఎన్.గౌరీష్, కె.కోదండరాం, ఎ.అప్పారావు, కె.కూర్మారావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'విత్తన సబ్సిడీని వినియోగించుకోవాలి'



ఇచ్ఛాపురం రూరల్: రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తున్న ఎంపీపీ బోర పుష్ప తదితరులు

కంచిలి: ప్రభుత్వం రైతులకు ఇస్తున్న విత్తన సబ్సిడీలను వినియోగించుకోవాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షిలు సూచించారు. మండలంలోని మండపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకుడు జగన్మోహనరావు, మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ, వైఎస్సార్‌సీపీ నేత మాదిన ధనుంజయ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కీలు సత్యనారాయణ, బెందాళం తేజేశ్వరరావు, లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: ప్రభుత్వం రైతులకు రాయితీపై అందజేస్తున్న వరి, పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బోర పుష్ప సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో రైతులకు విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి పిరియా శ్రీదేవి మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 40 శాతం రాయితీపై 82 వేల ఎకరాలకు అవసరమైన 1,004 క్వింటాళ్ల వరి విత్తనాలు సరఫరా చేస్తున్నామన్నారు. 1,061, 1,064, ఆర్జెల్, బీపీటీ 5,204, స్వర్ణ రకాలతో పాటు ఎంటీయూ 1,318, 1,121, 1,224 రకాలకు చెందిన విత్తనాలు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దక్కత నూకయ్యరెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



కంచిలి: విత్తన విక్రయాలు ప్రారంభిస్తున్న ఎంపీపీ దేవదాస్ రెడ్డి తదితరులు

నూతన కార్యవర్గం ఎన్నిక

టెక్కలి: మండలంలోని తొలుసూరుపల్లి గ్రామంలో ఉన్న రామకృష్ణ సేవా సమితి నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బగాది రామకృష్ణ, ఉపాధ్యక్షునిగా చింతాడ పాపారావు, కార్యదర్శిగా శిగిలిపల్లి ఠాగూర్‌తో పాటు ఎస్.కనకారావు, ఆర్.ప్రకాశరావు, ఎం.ధనుంజయ్, కె.అమ్ముడమ్మ, ఎం.లోకేష్ తదితర సుమారు 16 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

బాధ్యతల స్వీకరణ



ప్రవళ్లికప్రియను సాదరంగా ఆహ్వానిస్తున్న సిబ్బంది

టెక్కలి: టెక్కలి తహసీల్దార్‌గా కె.ప్రవళ్లికప్రియ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇదివరకు సారవకోట తహసీల్దారుగా పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా టెక్కలి తహసీల్దారుగా వచ్చారు. ఈ మేరకు ఇతర సిబ్బంది ఆమెను సాదరంగా ఆహ్వానించారు.

సచివాలయ పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

కాశీబుగ్గ: పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామ సచివాలయం నూతన భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా పనులను నాయకులు, అధికారులు బుధవారం సంయుక్తంగా పర్యవేక్షించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి శరవేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. పరిశీలనలో పలాస పీఏసీఎస్ అధ్యక్షుడు పైల వెంకటరావు(చిట్టి), పలాస ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు, బొచ్చ షణ్ముఖరావు పాల్గొన్నారు.

కమిషనర్‌కు స్వాగతం పలికిన ఆర్పీలు



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా విధులకు హాజరైన నాగేంద్రకుమార్‌కు 31 వార్డుల పరిధిలో పనిచేస్తున్నటువంటి రీసోర్స్ పర్సన్‌లు బుధవారం స్వాగతం పలికారు. 2013, 2014, 2019 సంవత్సరాల్లో ఇక్కడే పనిచేసి మరలా రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు సమక్షంలో పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తలితిరి పుణ్యావతి, వమరవల్లి హేమలత, సరియాపల్లి సుకన్య, లక్ష్మి, శోభ పాల్గొన్నారు.

'సంతను పరిరక్షించాలి'

కంచిలి: మండలంలోని అంపురం పంచాయతీ పరిధి నరసన్నముకుందాపురం రెవెన్యూ గ్రామంలో గడచిన 40 ఏళ్లుగా నిర్వహిస్తున్న రోజువారీ మార్కెట్ వ్యవసాయ సంత స్థలాన్ని కబ్జాదారుల నుంచి పరిరక్షించాలని సర్పంచ్ మద్ది మోహిని కోరారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. కత్తివరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఈ సంత స్థలం విషయమై తహసీల్దార్ కార్యాలయానికి చేసుకొన్న అర్జీ ప్రాప్తికి, తహసీల్దార్ ద్వారా పంచాయతీకి వచ్చిన నోటీసుకు సమాధానంగా ఈ వినతిపత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. గ్రామసభ నిర్వహించి, ఏకగ్రీవంగా ఈ సంత స్థలం పంచాయతీకే చెందుతుందని, రెవెన్యూ రికార్డుల్లో అంపురం గ్రామ పంచాయతీ డైలీ మార్కెట్‌కు చెందిన ప్రభుత్వ స్థలంగా పునః నమోదు చేయాలని కోరారు. వినతిపత్రం అందించినవారిలో ఉప సర్పంచ్ లింగం కేశవరావు, మద్ది అప్పారావు, మద్ది ఆనందరావు, మద్ది ఆదినారాయణ, మునకాల వీరాస్వామి, పితాంబర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న అంపురం పంచాయతీ ప్రజలు

పుస్తకావిష్కరణ

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన రసాయన శాస్త్ర అధ్యాపకుడు బి.సతీష్‌కుమార్ రచించిన పర్యావరణ విద్య పుస్తకాన్ని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ పుస్తకం సెకండియర్ బీఏ, బీఎస్సీ, బీకాం సెమిస్టర్–3 విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అధ్యాపకుడు సతీష్‌కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉన్న అక్షర గ్రంథాలయానికి పుస్తకాలను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ప్రోత్సాహంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి బి.రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

ఈదురు గాలుల బీభత్సం

కోటబొమ్మాళి: మండలంలో బుధవారం రాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అలాగే మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌పై బాదం చెట్టు విరిగిపడింది. ఆ చెట్టును తొలిగించే ప్రయత్నంలో చెట్టు నుంచి జారిపడి జూనియర్ లైన్‌మెన్ గోపాల్, అసిస్టెంట్ లైన్‌మెన్ శాంతారావులకు గాయాలయ్యాయి. మొదట వీరిద్దరినీ వైద్యం నిమిత్తం స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం శాంతారావును శ్రీకాకుళం రిఫర్ చేశారు. సొడాంలో విద్యుత్ లైన్‌పై కొబ్బరి చెట్టు విరిగిపడడంతో రెండు విద్యుత్ స్తంభాలు కారుపై పడ్డాయి. దీంతో కారు ధ్వంసమైంది. రాత్రివేళ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏఈ బి.వెంకటసురేష్ తెలిపారు.



సొడాంలో కారుపై విరిగిపడిన విద్యుత్ స్తంభం

ఆకట్టుకున్న వేషధారణలు

పలాస మండలం కిష్టుపురం గ్రామంలో జరుగుతున్న గ్రామదేవత ఉత్సవాలు బుధవారంతో పూర్తిస్థాయిలో ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్నవారు వేసిన పగటి వేషధారణలు ఆకట్టుకున్నాయి. పురాణాల్లో ఉన్నటువంటి వేషధారణలతో కనువిందు చేశారు.

కాశీబుగ్గ



భక్తిశ్రద్ధలతో గ్రామ దేవత నిమజ్జనం

మందస: మేజరు పంచాయతీ మందసలో జరిగిన అన్నపూర్ణమ్మ తల్లి ఉత్సవాలు ముగిశాయి. దీంతో సంప్రదాయంగా వస్తున్న అమ్మవారి నిమజ్జనాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చివరి రోజైన మంగళవారం సాయంత్రం బయలుదేరిన అమ్మవారి ఊరేగింపు బుధవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు సాగింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా భక్తులు పెద్ద సంఖ్యలో జెన్నాచెరువు వరకు బారులుతీరారు. మంజూష సంస్థానం చివరి జమీందారు వారసులు కల్నల్ ఛత్రపతి సింగ్ దేవ్, ప్రతాప్ కేసరి సింగ్‌దేవ్, డాక్టర్ విశాల్‌ప్రతాప్ సింగ్‌దేవ్‌లు నిమజ్జనంలో పాల్గొన్నారు.



అమ్మవారిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు

అభివృద్ధి పథంలో గ్రామాలు



ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న దువ్వాడ వాణి తదితరులు

- వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి
- అయోధ్యపురం పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం

టెక్కలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని అయోధ్యపురం పంచాయతీ పరిధి దీపావళి, చిన్నరోకళ్లపల్లి, చొంపాపురం తదితర గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందజేసిన లబ్ధిని వివరించారు. అనంతరం గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని తెలియజేయడంతో పాటు స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు, ఎంపీటీసీ పి.పాల్గుణరావు, నాయకులు బి.హరి, ఎం.ఢిల్లేశ్వరరావు, బి.ఈశ్వరరావు, టి.జగ్గారావు, జి.తేజ, డి.శేషయ్య, రామారావు, బి.నారాయణరావు, కె.వీరయ్య, అప్పారావు, రామయ్య, రామకృష్ణ, సర్పంచ్‌లు పి.మోహన్, జి.మోహన్‌రెడ్డి, ఎం.శంకర్, కె.కామేష్, బి.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి



సమావేశంలో పాల్గొన్న డివిజన్ స్థాయి అధికారులు

- సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి రూరల్: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఎస్పీ బాలచంద్రారెడ్డితో పాటు డివిజన్ స్థాయి అధికారులతో సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు నియమాలు అతిక్రమించి వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకోవాలని, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి అపరాధ రుసుములు విధించాలని సూచించారు. రహదారికి ఇరువైపుల ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే తొలగించాలని, తద్వారా రహదారులు వెడల్పుగా ఉంటాయని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ఎక్కువగా ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయో గమనించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు తక్షణమే చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖాధికారులకు సూచించారు. అదేవిధంగా గ్రామ సభలు నిర్వహించి రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాల పనితీరు పరిశీలించాలన్నారు. సమావేశంలో ఏవో రాజమోహన్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు, పంచాయతీ రాజ్ ఈఈ సురేష్‌కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ పి.సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఈఈ, ఆర్టీసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఇచ్ఛాపురం

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గత 15 రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతగా ఇచ్ఛాపురం ఎఫ్‌సీసీ జట్టు నిలిచింది. ఈ టోర్నీలో 18 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌కు ఇచ్ఛాపురం ఎఫ్‌సీసీ, కవిటి జట్లు చేరుకున్నాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన ఇచ్ఛాపురం జట్టు 18 ఓవర్లలో 180 పరుగులు చేసింది. 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కవిటి జట్టు 18 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేసింది. విన్నర్ జట్టుకు ట్రోఫీని వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, గుప్త, నరసన్నపేట సర్పంచ్ శంకర్ అందజేశారు. టోర్నీ నిర్వాహకులు డేవిడ్, సక్క రాము, రాకేష్, అల్లంశెట్టి రవి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు, నాయకులు

సాగునీటి సమస్య పరిశీలన



కుంఛాగాయి కాలువను పరిశీలిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు

కంచిలి: మండలంలోని కొల్లూరు, మఠం సరియాపల్లి పంచాయతీ పరిధి నారాయణబట్టి గ్రామాల రైతుల మధ్య చాలాకాలంగా ఉన్నటువంటి సాగునీటి పంపిణీ సమస్యను, ఇరుగ్రామాల రైతుల ఫిర్యాదుల మేరకు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, తహసీల్దార్ ఎస్.హైమావతిలు బుధవారం పరిశీలించారు. కుంఛాగాయి కాలువకు సంబంధించి పంపిణీ అయ్యే సాగునీటి సర్దుబాటు విషయంలో ఈ రెండు గ్రామాల రైతుల మధ్య ఉన్న వివాదాన్ని తెలుసుకున్నారు. రెండు గ్రామాల రైతుల వాదనలను విన్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలు గురించి సమాలోచన చేస్తున్నట్లు ఎంపీపీ తెలిపారు. పరిశీలనలో మండల సర్వేయర్ నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ మధుసూదన్ పాణిగ్రాహి, మఠం సరియాపల్లి సర్పంచ్ కొణపల సురేష్, ఉప సర్పంచ్ ఆనంద్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం, కొల్లూరు పంచాయతీ నేత పైల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.